## అభివృద్ధి పనులుపై సుడా చైర్మన్ సమీక్ష



2 లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 19 సెప్టెంబరు, 2025 | పేజీలు :08



## లక్ష్యంతో ముందుకెళ్తే
# ఉజ్వల భవిష్యత్తు

### కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/బోధన్:**విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోదించారు. గురువారం నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం చింతకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ సెంటర్ లను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ బేటి అయ్యారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, వారి బోధన సామార్థ్యాన్ని అంచనా వేశారు. చదువులో ఎలా రాణించాలి. పరీక్షల్లో విజ యం ఎలా సాధించాలి, లక్ష్యానికి అనుగుణంగా సిలబస్ ను ఏవిధంగా సకాలంలో పూర్తి చేసుకోవాలి. జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు, తల్లి దండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కార్యచరణ ప్రణాళికను ఎలా సిద్ధం చేసుకోవాలి తదితర అంశాలను విద్యార్థులకు కలెక్టర్ సవివరంగా వివరించారు. కలెక్టర్ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా అన్నది గమనించి, విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రైమరిపాఠశాలో బాలుర కోసం టాయిలెట్ నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# అసంపూర్తిగా డైనింగ్‌హాల్స్ నిర్మాణాలు

### నిలిచిన మన ఊరు మన బడి పనులు
### ఆరుబయటే విద్యార్థుల భోజనాలు

**ప్రజాపక్షం/చొప్పదండి:**మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో చొప్పదండి మండల పరిధిలో చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలో



మౌలిక వసతులు, డైనింగ్ హాల్స్ కోసం చేసిన పనులకు గుత్తేదారులకు నిధులు విడుదల కాకపోవడంతో పనులు మద్యలోనే ఆగిపోయాయి. చొప్పదండి పట్టణంతో పాటు మండలంలోని మొత్తం నాలుగు పాఠశాలలను ఎంపిక చేశారు. చొప్పదండి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ పనులు 95 శాతం పనులు పూర్తికాగా వినియోగంలో లేదు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాలు 90 శాతం పనులు పూర్తి కాగా తాత్కాలికంగా అసంపూర్తిగా ఉన్న హాలులోనే ఇబ్బందులు పడుతూ వినియోగిస్తున్నారు. మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలోని పాఠశాలలో అసంపూర్తిగా పనులు పూర్తికాగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లోరింగ్‌తో పాటు నీరు, విద్యుత్ సౌకర్యాల వంటివి అసంపూర్తిగానే మిగిలాయి. మండలంలోని రాగంపేట గ్రామంలోని పాఠశాలలో పిల్లర్ స్థాయిలోనే డైనింగ్ హాలును నిలిపివేశారు. గత ప్రభుత్వం 2022లో చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమానికి సర్కారు నిధులు మంజూరు చేయక పోవడం వల్ల ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.

**ఆరుబయటే విద్యార్థుల భోజనాలు:**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధివిధానాలు మారడంతో డైనింగ్ హాలు పనులకు మోక్షం కలగడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులను కనీస పర్యవేక్షణ లేదు. ఫలితంగా సంబంధిత మండలంలోని ఆయా పాఠశాల విద్యార్థులు డైనింగ్ హాలు వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఆరుబయటే భోజనాలు చేసే దుస్థితి ఏర్పడింది. కోతుల బెడదతో పాటు వర్షాకాలం దృష్ట్యా భోజనాల సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. కాగా అసంపూర్తిగా నిలిచిపోయిన డైనింగ్ హాలు నిర్మాణాలు, మౌలిక వసతులకు సంబంధించిన నిధుల విషయలోనూ సంబంధిత అధికారుల వద్ద స్పష్టత లేకపోవడం కొసమెరుపు. పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్లు బిల్లుల విడుదల కోసం ఏళ్లుగా ఎదురు చూపులు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన వివిధ పాఠశాలల డైనింగ్ హాల్స్‌ను పూర్తిస్థాయిలోకి వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో మోహన్ మాట్లాడుతూ పనులు ఆగిపోయిన మాట వాస్తవమేనని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

# దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ :**జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రం బాసరలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.జిల్లా ప్రజల అభ్యున్నతి కోసం అమ్మవారిని ప్రార్థించిన కలెక్టర్ కు దేవస్థానం అర్చకులు ఆశీర్వచనం అందించి,సాంప్రదాయరీతిలో సత్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయ పరిసరాలను అధికారులు,పూజారులతో కలిసి పరిశీలించారు.దసరా నవరాత్రి ఉత్సవాలలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని సూచించారు.క్యూ లైన్లు,వి.ఐపి క్యూలైన్,అక్షరాభ్యాసం మండపాలు, దర్శనం,లడ్డు కౌంటర్లు,సీసీటీవీ కెమెరాలు,అన్నదానం,తాగునీరు,వసతి వంటి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి,అధికారులకు పలు సూచనలు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్,సెక్యూరిటీ,శానిటేషన్,ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు.లైటింగ్,పార్కింగ్,పూల అలంకరణ,పెయింటింగ్,నిరంతరం సానిటేషన్,మొబైల్ టాయిలెట్,వైద్య శిబిరం,పోలీస్ సెక్యూరిటీ,గోదావరి ఘాట్స్ వద్ద సౌకర్యాలు వంటి ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.రహదారులను తక్షణం మరమ్మతులు చేయడంతో పాటు,ఫైర్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసులకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్,దసరా నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భక్తుల రద్దీ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆలయ చైర్మన్ శరత్ పటాక్,ఏ.ఎం.సి చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,సబ్ కలెక్టర్,ఆలయ ప్రత్యేక అధికారి సంకేత్ కుమార్, ఆలయ ఈవో అంజని దేవి,డిపి ఓ శ్రీనివాస్,తహసిల్దార్ పవన చంద్రతో పోలీస్,ఫైర్,పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి





**ప్రజాపక్షం/కరీంనగర్ :**ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు, కార్యాలయాల్లో లైంగిక వేధింపు నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆద్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై జడ్పి సమావేశ మందిరంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పది మంది కంటే ఎక్కువ కార్మికులు , ఉద్యోగులు ఉన్న అన్ని సంస్థలు, కంపెనీలు ,కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు పూర్తి చేయాలన్నారు. కమిటీ సభ్యుల వివరాలు, ఫోన్ నెంబర్లు, లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. పది మంది కంటే తక్కువ కార్మికులు, ఉద్యోగులు ఉంటే వారిని జిల్లా , మండల నోడల్ యూనిట్‌లో చేర్చాలన్నారు. ప్రైవేట్ సెక్టార్లకు సంబంధించి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను పర్యవేక్షించాలని ఆదేశించారు. వీటి పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితురాలు తప్పనిసరిగా తమ సంస్థ, కార్యాలయంలోని ఐసిసిలో ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంటాయని అన్నారు. అదే తరుణంలో మహిళలకు మేలు చేసే చట్టాన్ని దుర్వినియోగం చేయరాదని సూచించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, మెప్మా పిడి, స్వరూపారాణి, సిడిపివో సబిత, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ సుధా, అడిషనల్ డిఆర్డీవో రవికుమార్, ట్రస్మా చైర్మన్ శేఖర్ రావు తదితరులున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు


వేములవాడ


ఎల్లారెడ్డిపేట


వేములవాడ టౌన్:


కోనరావుపేట


చందుర్తి


వేములవాడ

## అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లి కనకయ్య

**ప్రజా పక్షం/ వేములవాడ :** పదికాలాలపాటు ఆయురారోగ్యాలతో వేములవాడ రాజన్న, నాంపల్లి లక్ష్మీ నరసింహస్వామి, అగ్రహారం అంజన్న దయతో స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గ ప్రజలకు తన సేవలు అందించాలని అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లి కనకయ్య అభిలాషించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అగ్రహారం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆయన పేరిట ప్రత్యేక అర్చన, స్వామివారికి వివిధ పూజ కార్యక్రమాలు జరిపించారు. నంది కమాన్ ప్రధాన చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి భారీ కేకును కట్ చేసి కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి జన్మదిన సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లి కనకయ్య మాట్లాడుతూ ప్రతిరోజు 24 గంటల్లో 18 గంటలు ప్రజల కోసం పనిచేసే రాష్ట్రంలోనే ఏకైక నాయకుడు ఆది శ్రీనివాస్ అని అలాంటి నాయకుడు వేములవాడ నియోజకవర్గం ఎమ్మెల్యే కావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎర్రం రాజు, రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, గుర్రం విద్యాసాగర్, మాజీ సర్పంచులు పండుగ ప్రదీప్, ఇటిక్యాల నవీన రాజు, సిలివేని మల్లేశం, మాజీ ఎంపీటీసీలు గాలి పెల్లి సువర్ణ స్వామి, బాస రాజశేఖర్, వంకాయల భూమయ్య, వనపర్తి దేవరాజు, నేతలు ఎర్రం సత్తయ్య, శ్రీనివాసరావు, ప్రభాకర్ రెడ్డి, ఆగయ్య, రాజిరెడ్డి, సుదర్శన్, మహిళా నాయకురాలు నాగారం కొమరవ్వ, యూత్ కాంగ్రెస్ పార్టీ నేతలు బొమ్మ తిరుపతి, కాసర్ల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:**వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు గురువారం వారి స్వగృహంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, చెన్ని బాబు, పందిళ్ల శ్రీనివాస్ గౌడ్, బాపు రెడ్డి, గంట వెంకటేష్ గౌడ్, బుచ్చి లింగు, సంతోష్ గౌడ్‌లు ఉన్నారు.

**వేములవాడ టౌన్:** వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శీనన్న జన్మదిన సందర్భంగా వేములవాడ ముస్లిం టౌన్ కమిటీ జనరల్ సెక్రెటరీ షాహిద్ పాష ఎమ్మెల్యేఆది శీనన్నని గజమాలతో సత్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్, కోఆప్షన్ మెంబర్ షేక్ బబూన్, మైనార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రజాక్, షేక్ యుసుఫ్, షేక్ ఇర్ఫాన్, అక్బర్, నాయకులు పాల్గొన్నారు.

**కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రజా నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికి స్వీట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు చేపూరి గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు అబ్బసాని శంకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పార్టీ జిల్లా కార్యదర్శులు కర్రోళ్ల భాస్కర్, బైరగోని నందు గౌడ్, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

**చందుర్తి :** ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండలంలోని సనుగుల గోవిందరాజుల స్వామి వారిని గురువారం ఉదయం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలం లోని రామన్నపేట గ్రామం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ భీమరాజు కనకరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి పండ్లు పంపిణీ చేశారు.


**కాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**వేములవాడ :** ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గం శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌కు జన్మదినం సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

**వేములవాడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం అందించగ ఆలయ ఈవో ఎల్ రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమాన్ని దేవస్థానం ఛైర్మన్ గెస్ట్ హౌజ్ నందు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని కొనియాడుతూ యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి, ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆది శ్రీనివాస్ ఉద్యోగుల బృందం శాలువాతో సత్కరించి, ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో అంకితభావం, సేవలను కొనియాడుతూ రాతపూర్వకంగా తయారుచేసిన మెమెంటోను బహుకరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఆలయ ఉద్యోగుల సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల జిల్లా కండ్లపల్లి లోని తెలంగాణ మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న చిలుకూరి శివకృష్ణని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న కండ్లపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ, రాష్ట్రస్థాయి అవార్డు పొందిన శివకృష్ణ సన్మానించారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ నాగేష్, ఉపాధ్యాయులు రాజా రమేష్, రాజశేఖర్, ప్రవీణ్, ప్రేమ్ సాగర్, కిష్టయ్య పాల్గొన్నారు.

## పెట్రోల్‌లో నీళ్లు ఎట్లా కలిశాయి..!?

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో వినియోగదారుడు 150 రూ పెట్రోల్ పోయించుకోగ అందులో అందులో నీళ్లు వచ్చాయని మేకల శరవింద్ అనే వ్యక్తి ఆరోపించాడు. వాహన దారుడు మాట్లాడుతూ తన బైక్ వచ్చి పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో బండి ఆగి పోవడంతో అనుమానం వచ్చి ప్లాస్టిక్ బాటిల్‌లో బైక్‌లోని పెట్రోల్ తీసి చూడగా అందులో నీళ్లు వచ్చాయని తెలిపాడు. ఇట్టి విషయం పై బంకు నిర్వాహకులు వాహనదారుడికి సమాధానమిస్తూ మా బంకులో ఎలాంటి కల్తీ జరగలేదని కావలంటే మీ ముందే మరో బాటిల్లో వేరే వారికి పెట్రోల్ పోసి చూపిస్తామని నేరుగా ఓ బాటిల్‌లో పోయగా అందులో ఎలాంటి కల్తీ లేకపోవడంతో, ఆరోపించిన వాహనదారుడి పెట్రోల్




ట్యాంక్‌లో ఉన్న నీరు కలసి ఉంటుందని బంకు నిర్వాహకులు తెలపడంతో సమస్య సద్దుమణిగింది. కాగా మండలంలోని పలు బంకులపై పలుమార్లు ఆరోపణలు, వార్తా కథనాలు వస్తున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం ఉందని వినియోగదారులు వాపోయారు.

## బొడ్డెమ్మ వేడుకలు

**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర మహిళలు ఒక చోట చేరి బొడ్డెమ్మను పేర్చి పాటలు పాడుతూ వేడుక జరుపుకున్నారు. బొడ్డెమ్మను కుల సంఘంలోని పెళ్లి కానీ అమ్మాయికి ఎత్తడం వీరి ఆనవాయితీగా వస్తుంది. ఎత్తిన బొడ్డెమ్మను ఊరేగింపుగా మహిళలు అంతా కలిసి డిజె పాటల నడుమ కోలాటాలు ఆడుతూ పట్టణంలోని ప్రధాన వీధులు అయిన నది చౌరస్తా అక్కడి నుండి శ్రీలక్ష్మి నృసింహ స్వామి దేవాలయం ముందు నుండి గోదావరికి వెళ్లి బొడ్డెమ్మ తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులుపై సుడా చైర్మన్ సమీక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్షించారు. సుడా కార్యాలయంలో సుడా చైర్మన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కరీంనగర్ నియోజకవర్గంతో పాటు చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు నగరంలో మిగిలిపోయిన పలు కూడళ్ల సుందరీకరణ, సుడా పరిధిలో చేపట్టబోయే నూతన లే అవుట్లు తదితర అంశాలపై చర్చించినట్లు నరేందర్ రెడ్డి తెలిపారు. సుడా కమర్షియల్ బిల్డింగ్, ఐడిసిఎంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సుడా పరిధిలో నూతన లే అవుట్లు ఏర్పాటు చేయాలని, అందుకు గతంలో గుర్తించిన ప్రాంతాలపై రెవెన్యూ ల్యాండ్ సర్వే ,సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆద్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తయారు చేసి లే అవుట్లు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వన్‌టౌన పోలీస్‌స్టేషన్ ఎదురుగా చొక్కారావు ఐల్యాండ్ పక్కన ఉన్న ఐల్యాండ్ సుందరీకరణ చేయాలని, నగరంలోని ప్రధాన రోడ్లలో గల నాలాల బ్రిడ్జిలపై ఇరువైపులా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో బ్రిడ్జి మాదిరిగా ప్లాంట్స్‌తో సుందరీకరణ చేయాలని నిర్ణయించామని నరేందర్ రెడ్డి తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలోని కొక్కెరకుంట, కోనాయపల్లి రోడ్డుకు నిధులు కేటాయించడం జరిగిందని, ఇంకా పలు అభివృద్ధి పనులు, సుడాకు అభివృద్ధి చార్జిలు కట్టని పెట్రోల్ బంకులకు నోటీసులివ్వాలని, కమర్షియల్‌గా నడుపుతూ సుడా అభివృద్ధి పన్నులు చెల్లించని ఫామ్‌లకు నోటీసులివ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపివో ఆంజనేయులు, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రొడ్డ యాదగిరి, డీఈఈ రాజేంద్ర ప్రసాద్, టిపివో శ్రీధర్ ప్రసాద్, టిపిఎస్ సంధ్య, అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలన్నీ పచ్చగా ఉండాలి...



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురష్కరించుకొని(సేవా పక్షం) కార్యక్రమాలలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ ప్రారంభించిన నుండి పారిశుధ్యం మీద ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇందులో భాగంగా పట్టణాలు పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంలో కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రేపాక రామచంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చందుపట్ల లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, ఉపాధ్యాక్షులు బాలగౌడ్, ఉడుగుల యాదగిరి, కమ్మరి ఆంజనేయులు,మానుక కుమార్, మారవేణి రంజిత్, కిరణ్ నాయక్, నిమ్మల సత్యం, సాగర్, చరణ్, రాంరెడ్డి, రాజు యాదవ్, గణేష్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'పోషణ్ బి పడాయి బి' కార్యక్రమం



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల అర్బన్ అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బి శిక్షణ కార్యక్రమంను మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు జగిత్యాల సిడిపివో మమతా గురువారం జగిత్యాల అర్బన్ అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బి పడాయి బి కార్యక్రమం గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ మూడు రోజులు ఉంటుందని తెలిపారు. మొదటి రోజు ప్రీ స్కూల్ మెటీరియల్ తయారు చేయడంతో పాటు అందుకు తగిన విధంగా శిక్షణ ఇచ్చారు.రెండవరోజు పోషణ్, మూడవ రోజు పోషణ్ బి పడాయి బి గూర్చి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవితారాణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల్లో మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/జమ్మికుంట:**జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుద్య పనుల్లో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ పాల్గొని శుభ్రపరిచారు. ఈ సంధర్బంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దృఢ సంకల్పంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 'నేను స్వచ్ఛత వైపు చేసే ప్రతి అడుగు.. భారత దేశాన్ని స్వచ్ఛంగా ఉండడానికి ఉపయోగపడతానని ప్రతిజ్ఞ చేయాలన్నారు. మున్సిపల్ ఆఫీస్ పక్కన పార్కులో గడ్డి తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో మున్సిపల మేనేజర్ జి.రాజిరెడ్డి, ఏఈ వికాస్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, టిపివో శ్రీధర్, టిపిబివో దీపికా, వాణి, భాస్కర్, శ్రీనివాస్, కార్మికులున్నారు.




## మధుయాష్కీగౌడ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ వారిని మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి బంజారాహిల్స్‌లోని వారి నివాసంలో పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## అదనపు కలెక్టర్‌కు రాజిరెడ్డి సన్మానం



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్‌ను గురువారం జగిత్యాల కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సీనియర్ జర్నలిస్ట్ బలిజ రాజారెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ అదనపు కలెక్టర్ రాజాగౌడ్ మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సీనియర్ పాత్రికేయులు సిరిసిల్ల శ్రీనివాస్, తాజా మాజీ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, కాంగ్రెస్ నాయకులు బద్ది మురళీధర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఇంద్రాల హారీష్‌లు ఉన్నారు.

## గో విజ్ఞాన పరీక్షలు

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల బాయ్స్ హైస్కూల్లో గోవిజ్ఞాన పరీక్షలు అనే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరనచ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రిన్సిపాల్ జ్యోత్స మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే అలవార్చుకోవాలని వ్యవసాయంలో కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని దేశి వాలి ఆవులతో పంచగవ్యాలు ఉపయోగించి సేంద్రియ వ్యవసాయ అనుభవించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సుమారు వందమంది వ్యాసరచన పోటీ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణమోహన్, కిషన్, మోహన్, ప్రసాద్, నరేంధర్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్, ఫూలే విగ్రహాలకు క్షీరాభిషేకం

### టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

**ప్రజాపక్షం/రామగిరి :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట గ్రామంలో ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బడుగు జీవుల ఆశా జ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన విగ్రహానికి జరిగిన అవమానం అత్యంత హేయమైన చర్య అని దీన్ని తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం పక్షాన ఖండిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి గారు పేర్కొన్నారు. గురువారం రామగిరి మండల కేంద్రంలోని కోల్ కారిడార్ చౌరస్తాలో అంబేద్కర్ పూలే విగ్రహాలకు అర్జీ త్రి ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య బిఆర్ఎస్ నాయకుడు కుమార్ యాదవ్ తో కలిసి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి వందన సమర్పణ చేశారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ 15వ తేదీ మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా పుట్ట మధు మరియు స్థానిక నాయకత్వం ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించదల్చుకున్నారు ఈ సందర్భంలో రాత్రికి రాత్రి దొంగతనంగా అంబేద్కర్ అవమానించే రీతిలో ముసుగును తొలగించారని ఇది పూర్తిగా ఆయన జరిగిన అవమానం అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగళి సంపత్ రెడ్డి, సెంట్రల్ కమిటీ నాయకులు కేశవరావు, దేవ శ్రీనివాస్,ఇసంపల్లి రమేష్ ,పాశం శ్రీనివాసరెడ్డి ,ఎండి షరీఫ్, దాసరి మల్లేష్ ,సుద్దాల తిరుపతి ,గిటుకు శ్రీనివాస్, భాగం పూర్ణాకర్, వీరగోని సంతోష్ గౌడ్,దేవరకొండ తిరు పతి, అల్లం తిరుపతి ,వేగోళం శ్రీనివాస్ గౌడ్ ,మాలోతు జగన్ నాయక్ ,బుద్దె ఉదయ్, మోట పోతుల ప్రదీప్ గౌడ్, దద్దెల చంద్రశేఖర్ , సంధి శ్రీనివాసరెడ్డి ,గాండ్ల సతీష్, రాఘవరెడ్డి ,ఏం రమేష్, చారి ,రాజమౌళి ,నర్సింగ్ రావు ,సురభి సందీప్, తదితరులు ఉన్నారు.




## విజయవంతమైన స్వస్త్ నారి సశక్తి

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల అల్లమయ్య గుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన స్వస్థ నారి సశక్తు పరివార్ అభియాన్ శిభిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ శిల్ప గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ వైద్య శిభిరాన్ని 124 మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. 15 సంవత్సరాలలోపు అమ్మాయిలు, గర్భిణీ స్త్రిలు అసంక్రమిత వ్యాధుల సంబంధించిన మహిళలు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అర్చన పాల్గొని మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంపైనే కుటుంబం ఆధారపడి ఉంటుందని, ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబాన్ని నిర్మిస్తుందని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని వంటశాలలో మహిళలు ఉప్పును, పంచదారను నూనెల వాడకాన్ని 10 శాతం తగ్గించి కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు, మహిళలు ఆహార ప్రాముఖ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల వై ద్య నిపుణులు డాక్టర్ శిల్పా, హెల్ ఎడ్యుకేటర్ తులసి రమణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ మజీద్ సిబ్బది పాల్గొన్నారు.




## బూరుగుపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్



**ప్రజాపక్షం/గంగాధర:**దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛభారత్‌లో భాగంగా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్ ఆద్వర్యంలో బిజెపి కార్యకర్తలు గురువారం శ్రమదానం నిర్వహించారు. గ్రామంలోని రోడ్డు పక్కన డ్రైనేజ్ నిండి మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో డ్రైనేజ్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తీసివేసి డ్రైనేజ్‌ను శుభ్రం చేశారు. రోడ్డు ఇరువైపుల ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించారు. కళ్యాణ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంఆ ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. బిజెపి మండల ఉపాధ్యక్షుడు బొమ్మకంటి రాజిరెడ్డి, బత్తిని శ్రీధర్, దూలం సత్తయ్య, శ్రీనివాస్, లింగాచారి, దూలం అనిల్, సాయిచరణ్, గడ్డం మహేష్, ఆడెపు హారీష్, ఆడెపు రాజు, పున్న నరేష్, కార్తీక్ తదితరులున్నారు.

## బాక్సింగ్‌లో సత్తా చాటిన కమాన్పూర్ విద్యార్థినులు




**ప్రజాపక్షం/రామగిరి :** ఎస్ జి ఎఫ్ ఐ ( స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో గురువారం జరిగిన అమ్మాయిల బాక్సింగ్ పోటీలలో పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ చూపి పతకాలను కైవసం చేసుకున్నారు.ఎనిమిదవ తరగతికి చెందిన జి. బింధు గోల్డ్ మెడల్, పదవ తరగతికి చెందిన డి. అక్షయ సిల్వర్ మెడల్. తొమ్మిదోవ తరగతి కి చెందిన పి.శశిరేఖసిల్వర్ మెడల్ సాధించారు.విద్యార్థినులు బాక్సింగ్ లో విశేష ప్రతిభ చూపించి పథకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి. రేణుక ను, మండల విద్యాధికారీ ఐ.విజయ్ కుమార్ , మరియు ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థినులను అభినందిస్తూ. రాష్ట్రస్థాయిలో త్వరలో జరిగే పోటీలలో విజయం సాధించే దిశగా కృషి చేయ వలసిందిగా కోరారు.

## అదరగొట్టిన హ్యాకథాన్




**ప్రజాపక్షం/కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్2025 పోటీలు సెప్టెంబర్ 16 న ప్రారంభమై 17న ముగిశాయి. విద్యార్థుల సృతజనాత్మక, వినూత్న ఆలోచనలకు ఈ హ్యాకథాన్ వేదికైంది. ఈ పోటీల్లో 16 జట్లు తమ ప్రజంటేషన్లను సమర్పించారు. ఇందులో 8 జట్లు ఎంపిక కాగా వీరు జాతీయ స్థాయిలో జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు తెలిపారు.

## రాచపల్లిలో హైమాస్ట్ లైట్స్ ప్రారంభం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో ప్రకృతి వనం కూడలి వద్ద రూ.1.50 లక్షల విలువైన హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మూడెత్తుల మల్లేష్ గురువారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ కృషితో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తులు ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీలకు మానేరు విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** రాష్ట్రవిద్యాశాఖ ఆద్వర్యంలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ 2025 పోటీలకు కరీంనగర్ లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విధ్యార్థిని ఎంపికైనట్లు విద్యాసంస్థల ప్రిన్సిపల్ జి.సరితారెడ్డి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆద్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ 2025 పోటీలు జరిగాయి. పోటీల్లో భాగంగా ఇన్స్‌ట్రూమెంటల్ మెలోడీ విభాగంలో పాఠశాలకు చెందిన సుస్వర మౌక్తిక అద్వితీయ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అభినందించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విధ్యార్థులు అభినందించారు.

# ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/గంగాధర:** చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి మల్యాల మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు సాగి అజయ్ రావు ఆధ్వర్యంలో మండంలోని బూరుగుపల్లి గ్రామంలో గురువారం సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతలమయం గా మారి ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, బూరుగు గంగన్న, రోమాల రమేష్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గరికంటి కరుణాకర్, మల్లేశం, పడితపల్లి కిషన్, గునుకొండ బాబు, అట్ల శేఖర్‌రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, అశోక్, కళ్యాణ్, వినోద్, తిరుపతి గౌడ్, శ్రీనివాస్,అంజయ్య,జానీ, తిరుపతి తదితరులున్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నాగిని పద్మజ దేవి దశదిన సందర్భంగా ఆమె కుటుంబని అలాగే దండేవేన వెంకటి మృతిచెందగా ఆయన కుటుంబని పరామర్శించి వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పోతిపెద్ది కిషెన్ రెడ్డి, మాజీ ఎంపీపీలు అత్తె చెంద్రమౌళి, జక్కుల ముత్తయ్య మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,గ్రామశాఖ అధ్యక్షుడు మాదాసి రమేష్,నాయకులు బర్ల కుమార్, బుచ్చయ్య, రాజిరెడ్డి,సంపత్, ఉపేందర్,శంకర్,రాజిరెడ్డి, ప్రసాద్,సదానందం, రాజగట్టు,ఓదెలు,రవి, దామోదర్ తో పాటు తదితరులు వున్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**ప్రజాపక్షం/ముత్తారం :** జిల్లాస్థాయి ఆటల పోటీలకు ముత్తారం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అండర్ 17 వాలీబాల్ లో ఎం. జ్యోతిక, సిహెచ్. శృతి, సిహెచ్ వినోద్, అండర్ 14 వాలీబాల్ కి ఇంద్రజిత్, కే శ్రీజ, కీర్తన, సహస్ర, ఎంపికయ్యారు. అండర్ 14 కబడ్డీ పోటీలో సాయి రిత్విక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మాదేవి, వెంకటేష్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తు విద్యార్థులను అభినందించారు.

## స్వచ్ఛత మానవ సమాజ స్వస్థతకు మార్గదర్శకాలు

### పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ఎంపిడిఒ రాము



**ప్రజాపక్షం/గంగాధర:** మనను, మనిషి, పరిసరాల స్వచ్ఛత మానవ సమాజానికి స్వస్థతకు మార్గదర్శకాలని ఎంపిడివో దమ్మని రాము పేర్కొన్నారు. స్వచ్ఛతహీ సేవలో భాగంగా మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో జిల్లా యునిసెఫ్ స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపిడివో దమ్మని రాము మాట్లాడారు. దేశ భవిష్యత్తుకు పునాదులు విద్యార్థులు అని, వారి కసిగా ఇష్టంగా ఎదగడానికి కష్టపడి చదవాలని ఉద్బోధించారు. గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. నిత్యావసర కిట్లను వారికి అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్‌గార్డెన్, వర్మికంపోస్ట్, లేబరేటరీ, భోజనం ప్లేట్ల ఏర్పాటు తదితర వినూత్న కార్యక్రమాలు, విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు అభినందనీయమని కొనియాడారు. యునిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, స్వచ్ఛభారత ప్రతినిధి రమేష్, మండల పంచాయతీ అధికారి గౌరీ రమేష్, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు గంగాధర సాయిలు, సిహెచ్ మమత, కారోబార్ తిరుపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** బిజెపి ఇల్లందకుంట మండల శాఖ అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో సేవాపక్షం అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో తహసీల్దార్ ఆఫీసు ఆవరణలో గరుడ చౌరస్తా వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోడీ గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, సేవాపక్షం కన్వీనర్ గుత్తికొండ రాంబాబు, కో కన్వీనర్లు తాళ్లపాపిరెడ్డి, మట్ట పవన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, రావుల విజయ్‌బాబు తదితరులున్నారు.

## ఇండోర్ గేమ్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/రామగిరి :** మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలోని క్రీడాకారులకు యాజమాన్యం ఇండోర్ గేమ్స్ ఆధునిక సౌకర్యాలు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుంది. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఇండోర్ క్రీడల కోర్టులను గురువారం ప్రిన్సాల్ బి విష్ణు వర్ధన్ వైస్ ప్రిన్సాల్ ఎం ఉదయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. జెఎన్టియుహెచ్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ పదవి బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్ట మొదటి సారి మంథని కళాశాలను సందర్శించిన సమయంలో కళాశాల విద్యార్థులు ఇండోర్ క్రీడలను ఆధునికరించాలని అభ్యర్థించారు. స్పందించిన విసి తక్షణమే నిధులను మంజూరు చేశారు. మూడు లక్షల రూపాయలతో సింథటిక్ రబ్బర్ మ్యాట్లతో మూడు షటిల్ బాడ్మింటన్ కోర్టులు, రెండు లక్షల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రబ్బర్ కబడ్డీ మ్యాట్లు, అలాగే టెన్నీస్ కు మ్యాట్లు మంజూరు చేశారు. దీనికి తోడు నాలుగు క్యారమ్ బోర్డులు, పది చెస్ బోర్డులతో అన్ని క్రీడలను ఒకే చోట ఏర్పాటు చేసే విధంగా ప్రిన్సాల్ పెద్ద ఇండోర్ షెడ్ కేటాయించారు. రాత్రి వేళలోను ఆడుకునేలా చక్కటి ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునికరించిన ఇండోర్ గేమ్స్ ను విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సిహెచ్ సుమన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విజయ్ పాల్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్ కుమార్, ఏఇఇ ప్రభాకర్, క్రీడాకారలు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కోసం కౌన్సెలింగ్



**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు రామగుండం3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు గురువారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 168 ఖాళీ క్వార్టర్లు ఉండగా, మెడికల్, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 56 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 08 మంది ఉద్యోగులు హాజరై, 08 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం యం.రామ్మోహన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, టి.మల్లిక, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డివై.పియం వి.సునీల్ ప్రసాద్, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, దాసు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని పోషించని కుమారులకు కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ఖంభాల చెన్నమ్మ తన ఇద్దరు కుమారులు పోషించడం లేదని హుజురాబాద్ ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆర్డీవో ఆదేశాల మేరకు ఇద్దరు కుమారులు ఒక్కొక్కరు రూ.4వేలు తల్లికి ఇవ్వాలని ఆదేశం ఇచ్చారు. కాగా ఆర్డీవో ఆదేశాలను అమలు చేస్తున్నారా? లేదా? అనే విషయమై జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారిని ఆద్వర్యంలోని ప్రత్యేక బృందం గురువారం విచారణ చేపట్టగా తన కుమారులు పోషించడం లేదని చెన్నమ్మ వివరించింది. ఈ క్రమంలో చెన్నమ్మ ఇద్దరు కుమారులైన కుంభాల స్వామి, కుంభాల గట్టయ్యలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులను పోషించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తల్లిదండ్రుల పోషణను చూసుకోగలమని కుమారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇద్దరు కుమారుల స్వామి, గట్టయ్య నుంచి రూ.16 వేల రూపాయలను తల్లిదండ్రులకు ఇప్పించారు. విచారణలో బేతిగల్ ఆర్ఐ రవి, డివిపి కౌన్సిలర్ పద్మావతి, చైల్డ్ హెల్ప్‌లైన్ సాయికిరణ్ గౌడ్, పోలీస్ కానిస్టేబుల్ పి.వినోద్ కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 21 సీనియర్ ఎంఆర్‌పిఎస్ సమావేశం




**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్:** ఈనెల 21 న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పెద్దపల్లి ఎన్ఎస్ పంక్షన్ హాల్లో సీనియర్ ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు గొర్రె రాజయ్య, తోకల మల్లేష్, దాసరి ఎల్లయ్య, మాతంగి గీత తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన ఉద్యమ ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎబిసిడి వర్గీకరణకు ఆమోదం తెలపడం, అమలుకు చర్యలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి దేవని సతీష్ మాదిగ, అల్లారం రత్నం హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో వివిధ రంగాల్లోని మాదిగ జాతి మేధావులు, సంఘాల నాయకులు, మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

# సిర్పూర్ టిలో కొత్త బస్టాండ్‌కు మార్గం సుగమం

**ప్రజాపక్షం/సిర్పూర్ టి:**సిర్పూర్ టి ప్రజల చిరకాల కోరికైన కొత్త బస్టాండ్ నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. గురువారం స్థానిక బస్టాండ్ ప్రహరీని ఆర్‌టిసి డిపో మేనేజర్ కెవి.రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి ర్పూర్ టౌన్‌లో ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ. 1.50 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయని, బస్టాండ్ నిర్మాణం పూర్తయితే ప్రజల కష్టాలు తొలగిపోతాయని స్పష్టం చేశారు.

# పూర్వ కలెక్టర్‌కు బిసిటీయు సన్మానం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**జిల్లా పూర్వ కలెక్టర్ చక్రపాణి(19921995) నిజామాబాద్‌కు వచ్చిన సందర్భంగా వారిని గురువారం బిసిటీయు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ కార్యాలయ గెస్ట్‌హౌస్‌లో శాలువ పూలబుకెలతో ఘనంగా సన్మానించామన్నారు. ఆయన జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో న్యాయమైన విద్యకై అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. ముఖ్యంగా పదవ తరగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించారని, అప్పట్లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటారన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవపురం గోపాలకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు మోహన్, గౌరవ సలహాదారులు రమణస్వామి పాల్గొన్నారు.

# వన్యప్రాణుల కేసుల పరిష్కారానికి కృషి చేయాలి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**వన్యప్రాణులకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. గురువారం డిపిఒ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్‌తో కలిసి ఆయన జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజ్ కుమార్ మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడే కేసులలో నిందితులకు త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు పోలీస్, అటవీ శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం టాస్క్ ఫోర్స్ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి చిత్తరంజన్, కాగజ్‌నగర్ ఎఫ్‌డిఒ సుశాంత్ సుఖదేవ్, సిబ్బంది ముసవీర్, ఝాన్సీ రాణి, సద్దాం పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

## డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.భాస్కర్




**ప్రజాపక్షం/మంచిర్యాల :**ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అని, విద్యావంతుల సమాజ నిర్మాణంలో వారి పాత్ర విశేషమని మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎ.భాస్కర్ అన్నారు. గురువారం ట్రస్మా ఆధ్వర్యంలో గురు బ్రహ్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. తాను కూడా ఉపాధ్యాయులకు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షులు దామెర్ల సిద్దయ్య మాట్లాడుతూ, తమ సంఘానికి జిల్లాలో సుమారు 150 పాఠశాలలు సభ్యత్వం కలిగి ఉన్నాయని, వీటిలో 120 పాఠశాలల ఉపాధ్యాయులకు అవార్డులు అందించామని తెలిపారు. గత 15 ఏళ్లుగా ప్రైవేట్ ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సత్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, కోట ఇనిస్టిట్యూట్ అంజి రెడ్డి, జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర నాయకులు , జిల్లా గౌరవ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు కొమ్ము దుర్గాప్రసాద్, వివిధ మండలాల అధ్యక్షులు, 700 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

# ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలి: జిఎం



**ప్రజాపక్షం /శ్రీరాంపూర్:**సింగరేణి సంస్థ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. 2025, 26 సంవత్సరానికి గాను ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రీడల కోసం ఎంపికైన ఉద్యోగులు, ఉద్యోగినులకు గురువారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ప్రగతి మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిఎం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, ఉద్యోగులు తమ ప్రతిభను పూర్తిగా ఉపయోగించుకోవాలని, యువ క్రీడాకారులకు సీనియర్లు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, డివైపిఎంఓ దేవేందర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నరసయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్, ఇండోర్ కె ప్టెన్ తోట సురేష్, కబడ్డీ కెప్టెన్ కార్తీక్ పాల్గొన్నారు.

# కొత్త పంచాయతీపై వివాదం

## నెల్కి వెంకటాపూర్, వందూర్ గూడ గ్రామాల మధ్య దూర సర్వే



**ప్రజాపక్షం/దండేపల్లి :**నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలైన నెల్కి వెంకటాపూర్, వందూర్ గూడ గ్రామాల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు సర్వే నిర్వహించారు. తమ గూడాన్ని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న వందూర్ గూడ గిరిజనులు, తమ గ్రామాన్ని నెల్కి వెంకటాపూర్‌లోనే కొనసాగించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**కోర్టు ఆదేశాలతో సర్వే**

గ్రామాల మధ్య దూరాన్ని తమ సమక్షంలోనే సర్వే చేయాలని వందూర్ గూడకు చెందిన కోవా దౌలత్ రావు మొకాశీ పిటిషన్ వేయగా, హైకోర్టు అందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో గురువారం ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఇ ముఫీకోద్దీన్ ఆక్బీలు ఇరు గ్రామాల పెద్దల సమక్షంలో సర్వే నిర్వహించి నివేదికను ఉన్నత న్యాయస్థానానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వందూర్ గ్రామ పటేల్ బీర్షావ్ మొకాశీ, నెల్కి వెంకటాపూర్ గ్రామ పెద్దలు నెల్కి సుభాష్, వనపర్తి రవి, మాజీ సర్పంచ్ భీమ్ రావు, ఆదివాసి సేన యూత్ అధ్యక్షుడు కోవా బాపురావు, నాయకులు కోవా ధర్మారావు, అడాయి చందు, సిడం కొమరయ్య, కోవా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సంచార కులాల సంక్షేమం ప్రభుత్వాలకు పట్టదా?



**ప్రజాపక్షం /మంచిర్యాల టౌన్ :**సంచార కులాల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా సంచార కులాల పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఈ కులాలకు కనీస ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తమ డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. సంచార కులాలకు రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం సంచార కులాలను రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. బిసి కమిషన్‌తో సంచార కులాలపై అధ్యయనం చేయించి, వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బిసి, ఎంబిసి, డిఎన్‌టిలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని, చేతి వృత్తుల వారిని ఎంబిసి జాబితాలో చేర్చాలని కోరారు. స్థానిక సంస్థలలో ఎంబిసి, డిఎన్‌టిలకు అవకాశాలు కల్పించేలా 42 శాతం రిజర్వేషన్లను ఎబిసిడి గ్రూపులుగా వర్గీకరించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన వర్గీకరణను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, చెలిమెల అంజన్న, శాఖపూరి భీమేష్, అశోక్ వేముల, కీర్తి బిక్షపతి, నెన్నెల నరసయ్య, అంకం సతీష్, చంద్రగిరి చంద్రమౌళి, సురేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెదురు దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం / జన్నారం:**ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జన్నారం మండల కేంద్రంలో మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు ఎంఆర్ నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు 2 కిలోమీటర్ల మేర ర్యాలీ చేపట్టారు. అనంతరం మహేంద్ర జెండాను ఆవిష్కరించి, మహేంద్ర సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం తహసీల్దార్ రాజా మనోహర్‌రెడ్డి, ఎఫ్‌డిఒ రామ్మోహన్, ఎఫ్‌ఆర్‌ఒలు సుష్మారావు, శ్రీధరచారి, కాంగ్రెస్, బిజెపి మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, మధుసూదన్, మహేంద్ర సంఘం మంచిర్యాల జిల్లా నాయకులు చిలువేరి నర్సయ్య, పిల్లి మల్లయ్య, కోడిజుట్టు రాజన్న, సూరనేని కొండయ్య, పర్ల కనకయ్య, పిల్లి నర్సయ్య, పోతు సురేశ్, సంద కృష్ణ, పర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌లాల్ డింగ్రా సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/మందమర్రి:**మదన్‌లాల్ డింగ్రా దేశానికి చేసిన సేవలు మరువలేనివని సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. పురుషోత్తం అన్నారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో గురువారం మదన్‌లాల్ డింగ్రా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువ వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన డింగ్రా వీరత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పురుషోత్తం తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాస్, పి. తిరుపతిరెడ్డి, వై. సుధాకర్,వెంకటేష్,పాఠశాలసిబ్బంది,విద్యార్థులుపాల్గొన్నా రు.

# సిఎం సహాయ నిధి పేదలకు చేయూత



**ప్రజాపక్షం/కాసిపేట:**సిఎం సహాయ నిధి పేదలకు చేయూత అందిస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 20 మంది లబ్ధిదారులకు రూ.5.20 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, పార్టీని ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మైదం రమేశ్, డాక్టర్ రాజమౌళి, గోలెటి స్వామి, సాకీర్, కలీం, సామ రాజిరెడ్డి, మడావి వెంకటేశ్, జక్కుల చంటి, పిడుగు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రీహితకు సన్మానం

**ప్రజాపక్షం/బైంసా:**ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత గా విధులు నిర్వహిస్తున్న మురళి అనే ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయుడి గా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్,ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన ఏపీ నగర్ కాలనీ డెవలప్మెంట్ కమిటీ గ్రూప్ గురువారం ఘనంగా సన్మానించింది,ఉత్తమ అవార్డు స్వీకరించడం కాలానికి గర్వకారమని ఈ సందర్భంగా పలువురు.పేర్కొన్నారు.ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు.ముధోల్ మండల కేంద్రంలోని రవీంద్ర పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్న మురళి మన కాలానికి గర్వకారమైన వ్యక్తిగా మాజీ కౌన్సిలర్ చందులాల్ అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మోహన్,ఆరే మరాఠా సంఘం ప్రతినిధి అవధూత్ పటేల్,మున్నూరు కాపు సంఘం నాయకులు రాములు,రజక సంఘం నాయకులు భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సొంతింటి కల సాకారం..



**ప్రజాపక్షం/కుంటాల:**ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పేదల సొంతింటి కల నేరవేరుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ అన్నారు.గురువారం మండలకేంద్రంలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఇచ్చిన హామీకి కట్టుబడి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చొరవ చూపిందని,లబ్ధిదారులు నిబంధనల మేరకు నిర్మాణాలను చేపట్టి,బిల్లులు పొందాలని సూచించారు.ఈ కా ర్యక్రమంలో డి.సి.సి.బి డైరెక్టర్ తూర్పటి వెంకటేష్ మాజీ పిఎసీఎస్ చైర్మన్ జుట్టు లక్ష్మ ణ్,జుట్టు మహేంధర్,భోగ లక్ష్మ ణ్,సబ్బిడి రాకేష్,మేర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీప్రాంతంలో గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలంలోని జక్కాపూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఓ యువతి మృతదేహాన్ని గుర్తించినట్లు నిజాంసాగర్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అటవీ శివారులో 14 18 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైందన్నారు. 5 ఫీట్ల ఎత్తు, తెలుపురంగు కలిగిన యువతి మెరూన కలర్ లెగ్గిన్, ఆకుపచ్చ రంగు టాప్ ఎరుపుకలర్ పువ్వుల డిజైన్, బూడిద రంగు శాలువా, రెండు కాళ్ళకు పట్టీలు, నడుముకు నలుపురంగు మొలతాడు, కుడికాలుకు నలుపు రంగు దారం ధరించి ఉందని, ఈ మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే నిజాంసాగర్ పోలీస్టేషన్ 8712686172, 8712666221 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# అప్పుడే బాగుండేది

### హామీల అమలలులో కాంగ్రెస్ విఫలం:బాల్క సుమన్

**ప్రజాపక్షం / చెన్నూర్ రూరల్ :**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ, అప్పుడే బాగుండేది, మా గ్రామం నుంచే పోరాటం అనే నినాదంతో బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లాలో ఉద్యమం చేపట్టింది. బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ పిలుపు మేరకు, చెన్నూర్ మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ వేలాది మంది కార్యకర్తలతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యనిర్వహణ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ గత 15 రోజులుగా చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించి ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని 40,000 ఫిర్యాదులు సేకరించడం జరిగిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూర్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించి, ఇంటింటికీ నల్లా నీటిని అందించామని చెప్పారు. గ్రామాల్లో కరెంట్ సమస్య లేకుండా చేశామని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచామని వివరించారు. చెన్నూరులో వంద పడకల ఆసుపత్రి, సాయిబాబా గుడి వద్ద వంతెన, క్యాతన్ పల్లిలో వంద పడకల ఆసుపత్రి, సిసి రోడ్ల నిర్మాణాలు, చెన్నూరు బస్టాండ్ ఆధునీకరణ, చెన్నూరు నుంచి మందమర్రి వరకు డబుల్ రోడ్డు విస్తరణ వంటి అనేక పనులు పూర్తి చేశామని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలు నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు, తిరిగి కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి కాదు




**ప్రజాపక్షం/నిజామాబాద్ :**బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని అత్యాధునిక వైద్య విధానం ద్వారా నయం చేయవచ్చని హైటెక్ సిటీ యశోధ హాస్పిటల్ సీనియర్ వైద్యులు డాక్టర్ గణేష్ జైశెత్వార్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం రక్తక్యాన్సర్ దినోత్సవంగా జరుపబడుతుందని, రక్త క్యాన్సర్ అనేది ప్రాణాంతకమైన వ్యాధి కాదని ఇట్టి వ్యాధిని అత్యాధునిక చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఇట్టి క్యాన్సర్ అత్యంత ఖరీదైన వైద్యం అభివృద్ధి చెందిన దేశాలలో 10 కోట్ల రూపాయల ఖర్చవుతుందని ఇక్కడ మాత్రం 20 లక్షలలో ఇట్టి వైద్యం పూర్తవుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రతాప్ అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోధ ఆస్పత్రిని సంప్రదించగా 2014–2017 వరకు చికిత్స అందజేయటంతో బాలుడు అత్యంత మెరుగై క్రీడలలో చదువులో రాణిస్తున్నాడని 13 సంవత్సరాల సోమేశ్వర్ ఇదే వ్యాధితో బాధపడుతుంటే అతనికి కూడా చికిత్సనందజేయటం జరిగిందని దాంతో బాలుడు చలాకీగా ఉన్నాడని, వర్ని మండలానికి చెందిన రామరావు 8 సంవత్సరాల నుండి రక్త క్యాన్సర్లు ఒకప్పుడు భయం అనిశ్చితిని కలిగించాయని కానీ 2025 లో ఖచ్చితమైన వైద్యం రోగనిరోధక చికిత్సలు లక్ష్యంగా చేసుకున్న మందులు ఆధునాతన ఎముక మజ్జ బోన్ మారో మార్పిడి కారణంగా అనేక రకాల రక్త క్యాన్సర్లు రక్త రుగ్మతలలో 90 శాతం మించిపోయాయని నేడు రోగులు బతికే వారు కాదని వారు పూర్తిగా సాధారణ ఆరోగ్యకరమైన జీవితాలను ఇట్టి చికిత్స ద్వారా గడుపుతున్నారన్నారు. దేశంలో ప్రతి 20సెకండ్లకు ఎవరైనా ఒకరు రక్త క్యాన్సర్ కారణంగా తమ ప్రాణాలను కోల్పోతున్నారని అయినప్పటికీ దేశంలో అందుబాటులో ఉన్న ఆధునిక సంరక్షణతో నేడు చాలామంది రోగులలో రక్త క్యాన్సర్ నయమవుతుందన్నారు. ఆరోగ్యం డబ్బు లాంటిదని మనం దానిని కోల్పోయే వరకు దాని విలువ మనకు నిజమైన ఆలోచన ఉండదని ఆయన ప్రత్యేకంగా గుర్తు చేశారు. క్యాన్సర్ అంటేనే భయపడే రోజులు పోయాయని ప్రతి క్యాన్సర్‌కు చికిత్సలు తప్పకుండా చేయబడుతాయని చికిత్సలతో నయమవుతయని తెలిపారు.

# మంచి డాక్టర్‌గా పేరు సంపాదించాలి

### జాతీయస్థాయిలో ర్యాంకు సాధించిన నలంద పూర్వ విద్యార్థికి ఘనంగా సన్మానం


**ప్రజాపక్షం/నిజామాబాద్ :**ఉన్నత శిఖరాలు అధిరోహించి మంచి డాక్టర్‌గా పేరు సంపాదించాలని పాఠశాల అధ్యక్షులు అట్లూరి మురళీకృష్ణ అన్నారు. నీట్ పీజీ 2025 లో జాతీయస్థాయిలో ర్యాంకు సాధించిన నలంద పూర్వ విద్యార్థినిని గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు అట్లూరి మురళీకృష్ణ మాట్లాడుతూ నలంద హైస్కూల్‌లో ఎల్‌కెజి నుంచి పదవ తరగతి వరకు చదివిన మా పాఠశాల విద్యార్థిని బోనగిరి దీక్షిత నీట్ పీజీ 2025 లో ఉత్తమ ర్యాంకును సాధించడం సంతోషంగా ఉందన్నారు. భువనగిరి దీక్షిత అం డర్ గ్రాడ్యుయేషన్ నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎంబిబిఎస్‌ను నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పూర్తి చేసిందని, ప్రస్తుతం నీట్ పీజీ 2025 లో జాతీయస్థాయిలో 558వ ర్యాంకు సాధించి మా పాఠశాల ప్రతిష్టను ఇనుమడింపజేసిందన్నారు. జాతీయస్థాయిలో 558వ ర్యాంకు రాగా మన రాష్ట్ర ర్యాంకు వచ్చేసరికి 27గా ఉందని, ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి దీక్షిత సాధించిన ఈ ర్యాంకు గుర్తింపుగా మా నలంద పాఠశాల యాజమాన్యం తరపున మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించామన్నారు. దీక్షితను స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సన్మానించామన్నారు. ఈ స ందర్భంగా దీక్షిత మాట్లాడుతూ నలంద హైస్కూల్‌లో నాణ్యమైన విద్యాబోధనతోనే తాను చదువులో రాణించగలిగానన్నారు. ఉపాధ్యాయుల, యాజమాన్యం ప్రోత్సాహం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవ అధ్యక్షులు నంగునూరు ప్రకాశం, సెక్రటరీ ఇంగు శ్రీనివాస్, బోర్డు మెంబర్ నేహా, దీక్షిత తండ్రి శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయిని,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గల్లంతైన మృతదేహాల కోసం గాలింపు చర్యలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాగమడుగు లో లేవల్ వంతెన వద్ద నిజాంసాగర్‌కు చెందిన రవి, బ్రాహ్మణపల్లికి గ్రామంలోని ఊర చెరువులో నీరడి పోచయ్య అనే వ్యక్తి వేరువేరుగా నీటిలో గల్లంతయ్యారు. వారి ఆచూకీ కొరకు బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డిలకు చెందిన అగ్నిమాపకశాఖ బృందాలు, నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాల వారు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు కొనసాగిన వీరి గాలింపు చర్యల్లో ఇరువురి జాడ లభించలేదని అక్కడి ఏర్పాట్లు పర్యావేక్షిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి వెళ్ళడించారు. గల్లంతైన వారి కుటుంబీకులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆమె వెంట స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## యశోద ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీలు




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**హైదరాబాద్ యశోద ఆసుపత్రులలో మెదడుకు రోబోటిక్ సర్జరీ సైతం చేస్తున్నామని న్యూరో సర్జన్ డాక్టర్ బి.జే.రాజేష్ అన్నారు.గురవారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో న్యూరో సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ..గత 30 సంవత్సరాల నుంచి యశోద హాస్పిటల్ లో క్రిటికల్ బ్రెయిన్,వెన్నుముక సంబంధించిన సర్జరీలు చేస్తున్నామన్నారు.నిర్మల్ ప్రాంతానికి చెందిన మహిళ మెదడులో ఉన్న కంతికి ఆపరేషన్ నిర్వహించామని అన్నారు.అలాగే శ్రీనివాస్ అనే వ్యక్తికి వెన్నుముక ఆపరేషన్ నిర్వహించగా..వీరిద్దరూ ప్రస్తుతం పూర్తిగా కోల్కొని,మామూలు స్థితికి చేరుకున్నారని పేర్కొన్నారు.యశోదలో ఎన్నో సంవత్సరాలు అనుభవం కలిగిన న్యూరో సర్జన్స్ ఉన్నారని చెప్పారు.రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి శస్త్ర చికిత్సలు సైతం నిర్వహిస్తున్నామని అన్నారు.రోడ్డు ప్రమాదాల వల్ల మెదడుకు తీవ్రమైన గాయాలు ఏర్పడిన సందర్భాల్లో రక్తస్రావాన్ని నిలిపివేయడం,మెదడు ఒత్తిడిని తగ్గించడం లాంటి ఎమర్జెన్సీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సిబ్బంది,చికిత్స పొందిన పేషెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గెలుపోటములు సహజమే: అడిషనల్ డిసిపి

**ప్రజాపక్షం/ఆర్మూర్ :**మండలంలోని చేపూర్ గ్రామంలో ప్రైమరీ పాఠశాలలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతనకు మారి ఆధ్వర్యంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర రూరల్ ముగింపు క్రీడా ఉత్సవాలకు జిల్లా అడిషనల్‌డిసిపిబస్వారెడ్డి, ఆర్మూర్ ఎసిపివెంకటేశ్వరరెడ్డి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రు లు కన్న కలను నిజం చేయాలని విద్యార్థులు ఏం కావాలనుకుంటున్నారో ఇప్పటి నుంచే ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. శ్రద్ధతో చదువుకుని గ్రామానికి తల్లిదండ్రులకు చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తేవాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. నాకు చదువు చెప్పిన గురువు అబ్రహ్మం లింకన్‌ను నేను ఇప్పటికి గుర్తు పెట్టుకుంటున్నాని అలాగే మీరు కూడా చదువు చెప్పిన గురువులను మరిచిపోకుండా గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం గెలుపొందిన జట్లను బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి, విడిసిఅధ్యక్షులు సారంగి శ్రీకాంత్, మాజీ జెడ్‌పిటిసిసారంగి సా ందన్న, ఎంఇఒ రాజాగంగారాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఇస్సాపల్లి జీవన్, చరణ్, రంజిత్, విడిసిభ్యులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయు నాయకులు , ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడోత్సవాలకు సహకరించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/ఆర్మూర్ :**మండలంలోని చేపూర్ గ్రామంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 15,16,17 మూడు రోజుల క్రీడోత్సవాలకు సహకరించిన పోలీసు శాఖ వారికి 12 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు పిఇటిలకు విద్యార్థులకు ఆటలను తిలకించటానికి వచ్చిన యువతకు మహిళలకు ఆటలకు సహకరించిన దాతలకు వీడీసీ అధ్యక్షులు సారంగి శ్రీకాంత్, కోశాధికారి కొండ్ర రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇలాంటి మంచి పనులు చేయడానికి చేపూర్ విడిసి ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ట్రస్మా సన్మానం..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న శ్యామ్ ప్రకాష్,ముజీబ్ ఖాద్రీలను టీచింగ్ అండ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా)నిర్మల్ జిల్లా శాఖ ఘనంగా సన్మానించింది.ఈ అవార్డులు ట్రస్మా సంఘం ప్రతిష్టను పెంచాయని ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,శ్యామ్ ప్రకాష్,ముజీబ్ ఖాద్రీలు విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ జిల్లా టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్,జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్,స్టేట్ ఈసీ మెంబర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు

# మృతుడి కుటుంబానికి యువకుల విరాళం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో మీకోసం మే ము సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామానికి చెంది న యువకులు మరోసారి తమ మానవ త్వాన్ని ఛాటుకున్నారు. ఈమధ్య కాలంలో చిన్న వయస్సులో అనారోగ్యంతో మరణించిన కొల్ల పండరి కుటుంబ సభ్యులకు 17,600ల రూపాయల విరాళాన్ని 38 మంది యువకులు కలిసి అందించారు. ఇది ఆర్థిక సహాయం మాత్రమే కాదని గ్రామంలోని యువతలో ఐక్యతా సేవా భావాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం చేపడు తునా న్నమన్నారు. మీకోసం మేము సేవా సమితి గ్రూప్ అడ్మిన్, అభయాంజనేయ క్షేత్ర ఆలయ ధర్మకర్త మెంగారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ సేవాసమితి ద్వారా మాగి గ్రామంలో సుమారు 12 పేద కుటుంబాలకు ఇదే విధంగా అంత్యక్రియల ఖర్చులకు గాను ఆర్థిక సహాయం అందించగలిగామన్నారు. యువత సేవ మార్గంలో నడవడం చూసి గర్వపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. సేవే మన ధర్మం సహాయం చేయడం మన భాధ్యత అన్న నానుడిని ఆచరణలో చూపుతూ మాగి గ్రామ యువత సమాజానికి దర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెంగారం శ్రీనివాస్, కొల్ల సంగయ్య, చింతకింది సాయిలు, కొల్ల శ్రీనివాస్, కొల్ల దుర్గయ్య, కొర్కంటి నగేష్, పెద్దల శేఖర్, చింతకింది నాగరాజు, మెంగారం జైపాల్ వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లోకి చొరబడ్డ దొంగలు

## 10లక్షల విదేశీ కరెన్సీ పది తులాల బంగారం చోరీ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**జిల్లా కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు భారీ చోరికి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి కిటికీ గ్రి ల్ ను తొలగించి లోనికి చొరబడ్డారు నగరంలోని 5వ టౌన్ పరిధిలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నగర శివారులోని బాబన్సపహాడర్ ప్రాంతంలో నివాసముండే నిషాత్ ఆఫ్రిన్ అనే మహిళ ఆర్సపల్లిలోని తమ బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో బుధవారం ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లింది. గురువారం ఉదయం వారు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లోని బీరువా ధ్వంసం చేసి వస్తువులన్ని చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వేసి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలాన్ని పరిశీలించగా దుండగులు ఇంటి కిటికీ గ్రిల్లు స్క్రూ డ్రైవర్‌తో తొలగించి లోనికి ప్రవేశించి దోపిడీకి పాల్పడిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. ఈ చోరీలో సుమారు పది లక్ష లవరకు విదేశీ కరెన్సీతో పాటు పది తులాల బంగారం దోపిడీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విషయం తెలియటంతో ఇది స్థానికులు దొంగల పని కాదని కిటికీ గ్రిల్ తొలగించి దోపిడీకి పాల్పడేది మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ముఠా దోపిడీ చేశారని అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలియటంతో సిసిఎస్ ఏసీపీ నాగేంద్రచారి ఘటనాస్థలానికి వెళ్లి దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. సహజంగా కిటికీ గ్రిల్ తొలగించి దోపిడీలకు పాల్పడేది అంతరాష్ట్ర ముఠానేనని ఏసిబి అనుమానాలు వ్యక్తం చేశారు. దోపిడీ ముఠాను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఘటన స్థలానికి 5వ టౌన్ ఎస్‌హెచ్‌ఓ గంగాధర్‌తో పాటు క్లూస్ టీం చేరుకుని ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముందుగా 20 తులాల బంగారం చోరీ అయినట్లు బాధితులు తెలిపినప్పటికీ ఇంట్లోని ఓ గదిలో బంగారు బిస్కెట్ ఇంటి యజమానికి దొరికినట్లుగా పోలీసులు తెలిపారు.

# ఖబడ్దార్ తెల్లం వెంకట్‌రావు, సోయం బాబురావు

## ఎఐబిఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు బాదావత్ శర్మనాయక్

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :**మండల బంజారా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఎఐబిఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు బాదావత్ శర్మనాయక్ మాట్లాడుతూ బిజెపిమాజీ ఎంపీ సోయం బాబురావు కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావులు ఇద్దరు గోండు తెగకు సంబంధించిన వారు లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడాన్ని మండల బంజారా సేవా సంఘ్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండించారు. వారు మాట్లాడుతూ మా లంబాడీల జనాభా ధామాషా ప్రకారం 1976 లోనే రిజర్వేషన్ ఏర్పాటు చేశారు అట్టి రిజర్వేషన్‌ను 2022 లో రాష్ట్ర ప్రభుత్వం అప్పటి సిఎం కేసీఆర్ 10శాతం రిజర్వేషన్ కల్పించారు. మా బంజారుల ఎదుగుదల ఓర్వలేకనే మమ్మల్ని ఎస్టీ జాబితా నుండి తొలగించాలని చిల్లర రాజకీయాలు చేస్తున్నారు పిటిషన్ దాఖలు చేసే అర్హత మీకు అసలే లేదు. మీ రాజకీయ స్వప్రయోజనాల కోసం మీ రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం మాత్రమే లంబాడీ గిరిజనుల ఎస్టీ రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు తుక్కాజీనాయక్, ధరావత్ లింగయ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు భుక్య సంతోష్‌నాయక్, బాదావత్ తిరుపతినాయక్, మాజీ ఎంపిటీసీ భుక్యా రాజునాయక్, బాబులాల్‌నాయక్, నాయకులు బుచ్చయ్యానాయక్, మంగ్యానాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి చెక్కులు ముధోల్ మాజీ ఎమ్మెల్యే పంపిణీ



**ప్రజాపక్షం/బైంసా:**దేగాం గ్రామంలోని వారి నివాసంలో గాడచంద గ్రామానికి చెందిన గుమ్మల ప్రమీల 60 వేల రూపాయలు సిరిపురం శ్రీనివాస్‌రావు 20వేల రూపాయల సీఎం సహాయనిధిచెక్కులను ఈ ముధోల్ మాజీ శాసనసభ్యులు అందజేయడం జరిగింది. చెక్కులు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు వెంకట్ రావు,నరేష్,ఎఎంసి డైరెక్టర్ అరుణ్ పాల్గొన్నారు.

# నాయకులకు సేవ చేయడమే పరమార్థం కావాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ పట్టణంలోని స్థానిక వేదం గ్లోబల్ హైస్కూల్లో స్కూల్ కౌన్సిల్ ఎలక్షన్లో గెలుపొందిన విద్యార్థులకు వేదం స్కూల్ డైరెక్టర్ డాకర్టర్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి స్లాషన్,బ్యాడ్జెస్ ప్రధానం చేయడం జరిగింది.ఈ ఎలక్షన్లో గెలుపొందిన విద్యార్థులు హెడ్ బాయ్ గా వర్షిత్(తొమ్మిదవ తరగతి),హెడ్ గర్ల గా తనుశ్రీ(9వ తరగతి) డిప్యూటీ హెడ్ బాయ్‌గా మణి కార్తీక్ (ఏడవ తరగతి)డిప్యూటీ హెడ్ గర్ల గా లాస్య(8వ తరగతి)స్పోర్ట్స్ సెక్రటరీ బాయ్స్ కేటగిరి సత్విక్(9వ తరగతి) చైత్ర గర్ల్స్ స్పోర్ట్స్ సెక్రటరీ కల్చరల్ సెక్రటరీ నైనిశా(8వ తరగతి),ఎన్నుకోబడ్డారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా సేవ దృక్పథంలో ఆలోచించాలని చెప్పారు.వెలుగు ఉన్నప్పుడు పనిచేయడం కాదు అందరూ పడుకున్న తర్వాత కూడా ఆలోచన చేసేవాడు అసలైన లీడర్ అని ఇతరుల కష్టాలు మన కష్టాలుగా భావించి పరిష్కారాన్ని చూపాలని ప్రతి విద్యార్థి నిత్య విద్యార్థిగా ఉంటూ ప్రపంచాన్ని శాసించే విధంగా న్యాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అ న్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భూపాల్ ,ప్రి న్సిపల్ శ్వేత,వీణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# బైంసా పట్టణంలోని జుల్ఫికర్ గల్లీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్



**ప్రజాపక్షం/బైంసా :**బైంసా పట్టణంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు బైంసా పట్టణ ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది బైంసా పట్టణంలోని జుల్ఫికర్ గల్లీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఈ కార్యక్రమంలో 115 బైక్‌లు ,3ఆటోలు,2 కార్లను స్వాధీనం చేసుకున్నారు.టౌన్ సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ సిసిటివి కెమెరాల ప్రాముఖ్యత,సైబర్ నేరాల మోసాలు టోల్ ఫ్రీ నంబర్ 1930,గంజాయి తాగిన మైనర్ డ్రైవింగ్ వంటి సామాజిక దురాచారాలు ఈ ప్రాంతంలో ఆస్తి నేరాలను నివారించడంలో సమాజిక దురాచారాలు ఈ ప్రాంతంలో ఆస్తి నేరాలను నివారించడంలో సమాజ పాత్ర గురించి తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రాబోయే దుర్గా నవరాత్రి పండుగలో శాంతిని కాపాడుకోవడం గురించి కూడా వివరించబడింది.ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోపీనాథ్,ఎస్ఐ నవనీత్ రెడ్డి,పోలీస్ స్టేషన్ సిబ్బంది 30 మంది టి.జి.ఎస్.పి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య శతక పద్య పోటీలు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :**జిల్లా ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని ఆధ్వర్యంలో మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు శతక పద్య పోటీలు,వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేసారు.ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు,వెన్నం అంజయ్య,మేనక వినోద్రాజ్,నామాల సురేష్‌కుమార్,రాపర్తి కిషన్ ప్రసాద్,బాదోల్ల రవికుమార్‌ల ఆధ్వర్యంలో సీనియర్,జూనియర్ విద్యార్థులకు వేరువేరుగా నిత్యజీవితంలో కంప్యూటర్ పాత్ర అనే అంశంపై వ్యాస రచన నిర్వహించారు.అదే విధంగా సీనియర్,జూనియర్ విభాగంలో ఎక్కువ శతక పద్యాలు కంఠతా చదివిన విద్యార్థులను విజేతలుగా ప్రకటించారు.శతక పద్య పోటీల్లో లక్ష్మి లతిక,ఖుషీ,దీప్తి,ప్రజ్ఞస్య,పాండురంగ,సాత్వికలు,వ్యాస రచనలో మల్లికార్జున,ఉదయ్,నిశిత,మహేశ్వర్,ప్రిన్సీ,ఫాతిమా,ఉమేజాలు గెలుపోందారు.వీరికి విడిసి నాయకులు రాచ లక్ష్మ ణ్,స్వామి,గజేందర్,ఉపేందర్,గిరి,ఉపాధ్యాయులు తొంటి శంకర్,శోభారాణి,ఇమ్రాన్,ఫరాజ్,విజయకుమార్,షఫీ,లక్ష్మ ణ్ రావు,స్వప్న,గంగాధర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండగకు పోలీస్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం



**ప్రజాపక్షం/బైంసా :**బైంసా పట్టణం లో సోమవారం నాడు నిర్వహించే బతుకమ్మ సంబరాల సందర్భంగా మున్సిపల్ శాఖ తరపున అన్ని సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా ఎటువంటి ట్రాఫిక్ లేకుండా చూడాలని పోలీస్ బందోబస్తు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎఎస్‌పి కి మున్నూరు కాపు మిత్ర మండలి తరపున వినతి పత్రములు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మున్నూరు కావు మిత్ర మండలి సలహా సభ్యులు డా.అల్లెం పోశెట్టి మున్నూరు కావు మిత్ర మండలి అధ్యక్షుడు గాలి రవి ఉపాధ్యక్షుడు రావుల పోశెట్టి కార్యవర్గ సభ్యులు బందెల శంకర్ మామిడి స్వామి కారేగిరి భూషణ్ ధర్మపురు ఆకుల రాజేశ్వర్,అల్లెం బాపురావు తదితరులు పాల్గొనడం జరిగింది.

# దివ్యాంగులకు, పింఛన్ దారులకు 6000,4000 పెంచాలి

## ఎమ్మార్పీఎస్ డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :**మండల కేంద్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వికలాంగులకు,బీడీ కార్మికులకు చేనేత కార్మికులకు ఒంటరి మహిళలు కండరాల అక్షింణిత వ్యాధి సంబంధించిన వాళ్లకు వితంతువులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఎన్నికల్లో పెంచుతానన్న పెన్షన్ దారులకు 2000 రూపాయల నుంచి 4000 రూపాయలు,వికలాంగులకు 4000 రూపాయల నుంచి 6000 రూపాయలు ఇస్తానని చెప్పి ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని అయినా కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వము ఇంతవరకు పెన్షన్ దారులకు విషయంలో ఇలాంటి స్పందన లేకుండా నడుస్తున్నది దీనిని ప్రతిపక్షం కూడా పట్టించుకోలేకపోతున్నది ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వికలాంగుల వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాటం చేయడం జరుగుతున్నదని అందులో భాగంగా సారంగాపూర్ మండల్ లోని తహసీల్దార్ కార్యాలయము ముట్టడి చేయడం జరిగిందని వికలాంగులు పెన్షన్ దారులు వారి యొక్క సమస్యపై ఎమ్మార్పీఎస్,అనుబంధ సంస్థల నాయకులు వచ్చి తహసీల్దార్ సంధ్యరాణి కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సారంగాపూర్ మండల్ అధ్యక్షుడు కత్తెరపాక శంకర్,కొలగని రాజు,దశరథ్,వీఎస్పీఎస్ రమేష్ రెడ్డి,దాసరి శేఖర్,విజయ లక్ష్మి ,కుతడి సాయి రొడ్డ గంగమని,కుతడి పోశెట్టి ,నాయకులు పాల్గొని తహసీల్దార్ కార్యక్రమాన్ని ముట్టడిని విజయవంతం చేశామని పెన్షన్ పెంచక పోతే రేవంత్ రెడ్డి సర్కారు రాబోయే రోజుల్లో హైదరాబాదులో జరగబోయే మహా వికలాంగుల సభ ఏర్పాటు చేస్తామని వికలాంగుల హక్కుల పోరాట సమితి తరపున,పెన్షన్ దారుల తరపున డిమాండ్ చేసారు.

## సబ్ రిజిష్టర్ కార్యాలయానికి తాళం




ప్రజాపక్షం/బోధన్:బోధన్ పట్టణంలోని సబ్ రిజిష్టర్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగు తుంది. కార్యాలయానికి గురువారం భవన యజమానులు తాళం వేశారు. సబ్ రిజిష్టర్ కార్యాలయ అధికారులు భవన యజమానులకు గత 36నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో విసుగు చెందిన భవన యజమానులు కార్యాల యానికి తాళం వేశారు. ప్రజలసమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని సబ్ రిజిష్టర్ అధి కారులను కోరగా భవన యజమానులతో మాట్లాడి తెరిపించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కొన్ని గంటల తరువాత నిజామా బాద్ జిల్లా అధికారుల హామీ ఇవ్వడంతో భవన యజమానులు కార్యాలయ తాళాన్ని తీశారు. సబ్ రిజిష్టర్ కార్యాలయం తాళాలు తీయడంతో రిజిష్ట్రేషన్ పనుల కోసం వచ్చిన వారి పనులు యధావిధిగా కొనసాగాయి.

## నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/బోధన్:బోధన్ పట్టణ ప్రజలకు శని వారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలు గుతుందని ఈ అంతరాయానికి పట్టణ ప్రజలు స హకరించాలని మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృ ష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ఫిల్టర్ బెడ్ పరిశుభ్రం చేస్తున్న కారణంగా తాగునీటి సరఫ రాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు.

## పిఆర్‌టియు మోపాల్ మండల అధ్యక్షులుగా కొట్టూర్ దేవదాస్




ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :పిఆర్‌టి యు మోపాల్ మండల నూతన అధ్యక్షులుగా కొట్టూర్ దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజశేఖర్, మహిళ ఉపాధ్యక్షురాలుగా నీరజలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరి గిన ఎన్నికల్లో పీఆర్‌టీయు జిల్లా ప్రధాన కార్య దర్శి గంగోని కిషన్, మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్య క్షులు కొట్టూర్ దేవదాస్ మాట్లాడుతూ మోపాల్ మండల ఉపాధ్యాయుల సమస్యలపై తన వంతు పాత్ర పోషిస్తానని అలాగే మండలంలో పీఆర్‌టీ ఆయు బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునితో పాటు ఏకగ్రీ వంగా ఎన్నికైన వారిని మోపాల్ మండల, జిల్లా ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని గ్యాస్ సిలిండర్ల ఆటో ధ్వంసం

### తృటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రజాపక్షం/ఎడపల్లి:బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎడపల్లి మండలం, ఎంఎస్‌సి ఫారం గ్రామంలో గురువారం ఒక గ్యాస్ సిలిండర్ల ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పైకి దూసుకెళ్లి పూర్తిగా ధ్వంస మైంది. ఆటోలో ఉన్న గ్యాస్ సిలిండర్లు దెబ్బతినక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఎంఎస్‌సి ఫారం గ్రామంలో గ్యాస్ సిలిండ ర్లతో వెళ్తున్న ఆటోను బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ధాటికి ఆటో డ్రైవర్ మధ్యలోకి దూసుకెళ్లి సగానికి పైగా ధ్వంసమైంది. అయితే ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సి లిండర్లు దెబ్బతినకుండా ఉండటంతో పెద్ద ముప్పు త ప్పింది. ఒకవేళ సిలిండర్లు పేలి ఉంటే తీవ్రమైన ప్ర మాదం జరిగి ఉండేది. ఈ ఘటనపై ఇండేన్ గ్యాస్ యజ మాని ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణ మైన ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## నాణ్యమైన విత్తనం రైతన్నకు ఆపన్న హస్తం



ప్రజాపక్షం/చొప్పదండి;నాణ్యమైన విత్తనం రైతన్నకు ఆపన్న హస్తమని వ్యవసాయ పరి శోధన కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త డా.బి.రామ్ ప్రసాద్ అన్నారు. ఈ సంద ర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులకు, పరిశోధనా కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాన్ని సర ఫరా చేసి విత్తనోత్పత్తిని గ్రామంలోనే ప్రోత్స హించేందుకు గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో గ్రామాలలో వరి క్షేత్రాలను పరిశీలించి బెరుకులు తీసివేయాలని సూచిం చారు. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాల న్నారు. శాస్త్రవేత్తలు డా.జి.ఉషారాణి, ఇ.ఉమారాణి, మండల వ్యవసాయ అధికారి వి.వంశీకృష్ణ, ఏఈవో రమ్యజ్యోత్స్న, రైతులు ఎ.తిరుపతి, ఎ.అశోక్, పి.కొము రయ్య, రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కోసం స్వసక్తి పరివార్ అభియాన్



ప్రజాపక్షం/గొల్లపల్లి : మహిళల ఆరోగ్యం మెరుగుపరచడానికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు కొనసాగుతుంది . ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ,జిల్లా వైద్య అధికారి ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 19 ,22 ,29 ,తేదీల్లో స్పెషలిస్ట్ లతో ఏర్పాటు చేసే ప్రత్యేక వైద్య శిబిరాన్ని మండలంలోని గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నరేష్ అన్నారు .ఈనెల19 న జనరల్ మెడిసిన్,22 న గైనకాల జిస్ట్ ,29 న డెంటల్ కి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు . మహిళలు కుటుంబ బాధ్యత లతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే శక్తివంతమైన కుటుంబం సాధ్యమవుతుందని వైద్యాధికారి తెలి పారు.ఈ కార్యక్రమం మహిళా ఆరోగ్యం కోసం ప్రత్యే కంగా నిర్వహిస్తున్నామని అందుకు మహిళలు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని కోరారు .వైద్య పరీక్ష లకు వచ్చేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి యొక్క ఆధార్ కార్డు వెంట తీసుకొని రాగలరని కోరారు.

బోధన్:కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ఉచిత ఆరోగ్య కేంద్రం శిబిరాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ డివిజన్ పరి ధిలో ఈ నెల 19న సాలూరా, రెంజల్ పిహెచ్‌సి, బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీలో యుపిహెచ్‌సిలో కేంద్రాలలో, 20 రుద్రూర్, పోతంగల్, ఎడపల్లి, మోస్రా పిహెచ్‌సి కేంద్రంలో, 22న కోటగిరి సిహెచ్‌సి, పట్టణంలోని పాన్ గల్లీ యుపిహెచ్‌సి, 23న పాన్ గల్లీ యుపిహెచ్‌సి వర్ని సిహెచ్‌సి మోస్రా, ఎడపల్లి పిహెచ్‌సి కేంద్రంలో, 24న పోతంగల్, రుద్రూర్, సాలూరా పిహెచ్‌సి కేంద్రాలలో, 25న రెంజల్ పెగడా పల్లి పిహెచ్‌సిలలో, బోధన్ పట్టణంలోని పాన్ గల్లి యుపిహెచ్‌సి కేంద్రంలో, 26న మోస్రా, పోతంగల్ , రుద్రూర్ పిహెచ్‌సి కేంద్రంలో, 30న మోస్రా పెగడాపల్లి పిహెచ్‌సి, కోటగిరి సిహెచ్‌సి, అక్టోబర్ 1న పోతంగల్ రుద్రూర్ పిహెచ్‌సి, వర్ని సిహెచ్‌సి కేంద్రాలలో స్త్రీ వైద్య నిపుణులు, పల్మనాలజిస్ట్, దంత వైద్యులు, పీడియాట్రి షన్స్, జనరల్ ఫిజిషియన్, ప్రత్యేక వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకా శాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి మండలంలోని ఆ ర్నకొండ గ్రామం నుంచి మల్యాల క్రాస్ రోడ్డు వరకు డ బుల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 కోట్లు నిధులను మ ంజూరు చేసినందుకు గాను చొప్పదండి ఎమ్మెల్యే డా .మేడిపల్లి సత్యంకు ఆర్నకొండ, రాగంపేట, రేవెల్లి, పెద్ద కుర్మపల్లె గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుల ఆధ్వర్య ంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషే కం చేశారు. కార్యక్రమంలో నాలుగు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటిన పోలీసు కమిషనర్



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని హుటాహుటిన అంబులెన్సులో తరలించి మానవత్వాన్ని చాటారు నిజామాబాద్ పోలీసు కమిషనర్. గురువారం మధ్యాహ్నం సమయంలో డిచ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామ శివా రులో ద్విచక్ర వాహనంపై వెళుతున్న అశోక్ గాంధీ (35) అనే వ్యక్తి అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. ఆ వ్యక్తి తలకు బలమైన గాయాలు అయి తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్నాడు. అటువైపు నుంచి వెళుతున్న నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య గమనించి తన కారు ఆపి గాయాలైన వ్యక్తిని పరామర్శించి సత్య రంగా అంబులెన్సుకు ఫోన్ చేసి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి ఎస్ఐ ఎం.డి. షరీఫ్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐడి కార్డుల అందజేత

ప్రజాపక్షం/ఎడపల్లి:ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువు తున్న విద్యార్థులందరికీ ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఏఆర్పీ క్యాంప్ గ్రామానికి చెందిన తోట రాజశేఖర్, తన తండ్రి తోట లింగం జ్ఞాప కార్థం సుమారు పదివేల రూపాయల విలువైన ఐడి కార్డులను విద్యా ర్థులకు అందచేశారు. అనంతరం స్కూల్ హెచ్ఎం రజిని కుమారి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తోట రాజశేఖర్ అందిస్తున్న సహాయ సహకారాలను అంభినందిస్తున్నామన్నారు. రాజ శేఖర్ మాట్లాడుతూ.. తాము ఏ హోదాలో ఉన్న ఎంత ఉన్నత స్థానంలో ఉన్న చదువుకున్న పాఠశాలను, జన్మభూమిని ఎప్పటికీ మర్చిపోమని చెప్పారు. రెడ్ క్రాస్ సోసైటీ గురించి, రక్తదానం వల్ల కలిగే లాభాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, గ్రామ పెద్దలు బలరాం, శ్రీనివాస్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

## కుర్నాపల్లిలో మూడున్నర తులాల బంగారం, నగదు చోరీ

ప్రజాపక్షం/ఎడపల్లి:ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కుర్నాపల్లిలో చోరీ జరిగింది. ఈ సంఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే తులసి గారి నరేందర్ రెడ్డి అనే వ్యక్తి కుటుంబ సమే తంగా ఓ ఫంక్షన్‌కు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. గదిలో ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులోని మూడు తులాల 8గ్రాముల బంగారాం, 30వేల నగదు, పది గ్రాముల వెండి ఎత్తుకెళ్లారు. ఈ చోరీ బుధవారం మధ్యాహ్నం జరగగా రాత్రి చుట్టు పక్కల వారు గమనించి బాధితులకు సమాచా రం అందించారు. దీంతో బాధితులు హుటాహుటిన సంఘటన స్థలా నికి చేరుకొని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసు లకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలాన్ని ఏసీపీ శ్రీని వాస్, సిఐ విజయ్ బాబు, ఎస్ఐ లు రమ, చంద్ర మోహన్ లు పరిశీ లించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో వివరాలు సేకరించా రు. అయితే ఇంట్లో 38న్నర తులాల బంగారంలో కేవలం 3.8 తు లాల బంగారం దొంగలు ఎత్తుకెళ్లడం కొసమెరుపు. త్వరలోనే చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకుంటామని ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

## వ్యాధి నివారణ టీకాలు వేసిన పశువైద్యాధికారులు

ప్రజాపక్షం/మోర్తాడ్:నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో పశు వైద్య, పశు సంవర్ధక శాఖ, మోర్తాడ్ మండలం ఆధ్వర్యంలో గురు వారం మండలంలోని సుంకెట్ గ్రామంలో 1750గొర్రెలు, అలాగే 90మేకలలో ఉచిత పిపిఆర్ (పొరుదు వ్యాధి) వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని మోర్తాడ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ గౌతమ్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, ఎల్ఎస్ఏ శైలీమ, హెచ్ఏ ప్రభాకర్, జీవాల పెంపకదారులు నక్క లింబాద్రి, చిన్న లింబాద్రి, సాగర్, జీల మల్లేష్, సైదులు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.